# పిల్లి కథ

## శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

" మ్యా ! మ్యా !

" అమ్మోయ్, పిల్లకూనేవ్ ! " అన్నది చిట్టి.

"తెల్లగా ఎంత ముద్దొస్తోందో ! " అన్నాడు బుల్లాడు.

" ఛీ, ఛీ ! దాన్ని ముట్టుకుంటారేమ్రా. పిల్లిని ముట్టుకుంటే పంచమహాపాతకాలూ చుట్టుకుంటై, " అన్నాడు నాన్న

" మ్యా, మ్యా !" అన్నది కూన.

" చూడు నాన్నా. ఎట్లా దగ్గిరికొస్తుందో " అన్నాడు బుల్లాడు.

" ఇది పెంపుడుపిల్లి. అందుకే పారిపోవటంలేదు, " అన్నది చిట్టి.

" చూడు నాచెయ్యి ఎట్లానాకుతుందో, " అన్నాడు బుల్లాడు.

" దానికాకలవుతోంది, "అన్నదిచిట్టి

" చెబితే మీక్కాదుటర్రా ? దాన్ని వెళ్ళగొట్టండి ముందు.....బొచ్చంతారాలిపోయి ఎంత అసహ్యంగా ఉందో, దాన్ని ముట్టుకున్నారంటే మీక్కూడా చీడ పట్టుకుంటుంది, "అన్నాడు నాన్న.

" దాని కాకలవుతుంది, నాన్నా. కొంచెం అన్నంపెట్టి వెళ్ళగొడదాం, " అన్నది చిట్టి.

" దానికి చీడలేదు, నాన్నా, " అన్నాడు బుల్లాడు. మజ్జిగా అన్నమూ కలిపిపెడితే కూన ఉత్సాహంగాతిన్నది.

అనుకున్న ప్రకారం కూన ఇల్లువదిలిపోలేదు అది ఇల్లు తన సొంతం చేసుకున్నది. అందరితో పాటు ప్రతిపూటా తిండి కొచ్చేది. మిగతా సమయాల్లో ఎండపొడో, వెచ్చని చోటో చూసుకొని నిద్రపొయ్యేది. రాత్రిపూట ఎవరో ఒకరి పక్కలో పడుకునేది దాని యిష్టం వచ్చినప్పుడు బయటికి వెళ్ళి పెత్తనాలు చేసి వచ్చేది.

నాన్నకు పిల్లిని చూస్తే చాలా కోపంగా ఉండేది. "ఏమిటీ వెధవపిల్లి ? పొద్దునే మనకు దీని దర్శనం ! అస్తమానమూ ఏ పనిచేసుకోబోయినా అడ్డం వస్తూంటుంది.... పిల్లలూ, మీరు దీన్ని మచ్చికచేస్తే ఊరుకోను రెండుపూటలు తిండివెయ్యకుండాఉంటే అదేపోతుంది" అన్నాడు నాన్న.

"ఏం, నాన్నా, పాపం....!" అన్నది చిట్టి.

"పిల్లి పాపిష్టిది ఇంకా కుక్కనయం విశ్వాసం గల జంతువు. దానికి స్వామిభక్తి ఉంది. పిల్లికి విశ్వాసం లేదు. తన సుఖమే చూసుకుంటుంది. ఇంకొకరి సుఖం ఓర్చలేదు. మనం ఏదన్నా తింటుంటే శాపనార్థాలు పెడుతుంది. పిల్లి శాపనార్థాలంటే అవే.

మనం తినే ముద్దలుకూడా లెక్కపెడు తుంది" అన్నాడు నాన్న.

"పిల్లికి ఒంట్లు వచ్చా, నాన్నా?" అన్నాడు బుల్లాడు.

"దాని ఒంట్లు దానికొచ్చులే." అన్నాడు నాన్న చిరాకుగా.

"పిల్లికీకూడా కృతజ్ఞత ఉంటుంది, నాన్నా. అది నాతోనూ బుల్లాడితోనూ ఆడుకుంటుందిగాని నీతో ఆడుకోదేం?" అన్నది చిట్టి.

"ఏమైనా దానికి అన్నంపెడితే నేను ఒప్పుకోను మనుషులకే తినటానికి లేకుండా ఉంది!" అన్నాడు నాన్న.

"దాని తిండెంత, నాన్నా? మనం పారేసినంత ఉండదూ!" అన్నాడు బుల్లాడు.

"వీల్లేదు." అన్నాడు నాన్న

*

"చూడండి, ఈ దిక్కుమాలిన పిల్లి ప్రద్దాన్నోనూ మూతి పెడుతున్నదీ! ఎట్లా చచ్చేది దీంతో?" అన్నది అమ్మ.

"గోతాలుపెట్టి ఊరిబయట విడిచేస్తే గాని దీనిపీడ వదలదు."

"దాన్ని అన్నంపెట్టక చంపుతుంటే ఏం చేస్తుందేం?" అన్నాడు బుల్లాడు

"దాన్నెవరు మేపుతారు? దానితిండి అది చూసుకోమను" అన్నాడు నాన్న.

"దాని తిండి ఏం చూచుకొంటుంది. ఇప్పుడింటో ఎలికెలుకూడా లేకుండా పోయినై" అన్నాడు బుల్లాడు.

"అవును, పాపం. దాని ధర్మమా అంటూ ఈ పిల్లొచ్చాక ఎలికెల బాధ లేదు" అన్నది అమ్మ.

"అది ఎలికెల్ని పట్టినా మనం దాని కన్నం పెట్టం" అన్నది చిట్టి.

"మనమే కృతజ్ఞత లేనివాళ్ళం" అన్నాడు బుల్లాడు.

"ఇంకేం ఎలికెల్ని పట్టుకోమను? మళ్ళీ అన్నంకూడా దేనికీ?" అన్నాడు నాన్న.

"ఎలికెలు అయిపోయినకొద్దీ మనకు లాభం, దానికి నష్టం. ఇదేం న్యాయం నాన్నా?" అన్నాడు బుల్లాడు.

"పట్టుకునేటందుకు ఎలికెలు లేక పోతే ఇంకా ఈ పీనిగె మన కొంపలో దేనికీ?" అన్నాడు నాన్న.

"అక్కర తీరితే అల్లుడు లంజ కొడుకు" అన్నాడు బుల్లాడు.

"అది ఇంటో ఉండగూడదర్రా, వెధవ చీడ పిల్లి! దాన్ని ముట్టుకుంటేనే రోగాలొస్తాయి" అన్నాడు నాన్న.

"చీడపిల్లా నాన్నా? చూడు దాని వొంటినిండాఊలుబంతల్లే ఎంతబొచ్చో. బలిసి ఎంత ముద్దొస్తున్నదో!" అంది చిట్టి.

"మనింటో బాగా పాలూ, మజ్జిగా తిని కొవ్వింది. లావుగా ఉండదూ?" అన్నాడు నాన్న.

"చిక్కితే చిక్కిందంటావు, బలిస్తే బలిసిందంటావు, యెట్లా నాన్నా?" అన్నాడు బుల్లాడు.

"మనం మనుష్యులంకదా, పిల్లుల్ని దగ్గిర పడుకోబెట్టుకోవటమూ, దాన్ని ఎత్తుకుని ఆడుకోవటమూ అసహ్యం కాదుట్రా?" అన్నాడు నాన్న

"అది మనకన్న శుభ్రంగాఉంటుంది,

రోజుకు పదిసార్లు ఒళ్ళంతా నాక్కుంటుంది. పక్కమీద ఉచ్చకూడా పొయ్యదు" అన్నది చిట్టి.

నాన్న మాట్లాడలేదు కాని, మర్నాటి నించీ పిల్లికూడా కనపళ్లేదు. నాన్న ఏంచేశాడో మరి.

★

క్రిస్మస్ శెలవులకి బావొచ్చాడు

చిట్టీ, బుల్లాడూ బావ చెరో చెయ్యీ పట్టుకు వేళ్ళాడుతూ పిల్లి కథంతా చెప్పారు.

"పిల్లిని వెళ్ళగొట్టటంఅన్యాయమే" అన్నాడు బావ. "మచ్చికచెయ్యని పిల్లి దాని యిష్టంవచ్చినట్లు అది జీవిస్తుంది. తిండి దొంగిలిస్తుంది. కొట్టబోతే పారిపోవటం నేర్చుకుంటుంది దాని బతుకు అది చూసుకుంటుంది. కాని మనం దాన్ని మచ్చిక చేసిన తరువాత దాని బతుకు అది చూసుకోలేదు. ఎలికెలబాధ కోసం పిల్లిని పెంచి ఎలికెల బాధ పోగానే దాన్ని వెళ్ళగొట్టేస్తే దాని గతి ఏంకానూ? కొన్నాళ్ళు మనుషులు దానికి తిండి పెట్టటంచేత మనిషి తనకు శత్రువనేజ్ఞానం దానికి లేకుండాపోతుంది. దొంగతనంగా తిండి సంపాదించటం దానికలవాటుండదు మనిషిని నమ్ముతూ అది తిండిలేక చస్తుంది. ఆ పాపం పెంచినవాళ్ళని చుట్టుకుంటుంది" అన్నాడు బావ.

"ఇప్పుడు మళ్ళీ మనింటో ఎక్కడ చూసినా ఎలికెలే" అన్నది చిట్టి.

"ఎందుకుండవూ? పిల్లి ఉన్నంత కాలమూ దానిఉపయోగం ఏమీ లేనట్టే ఉంటుంది. అదిపోయిన తరువాతగాని దానిప్రయోజనం తెలియదు." అన్నాడు బావ

"పిల్లులు మంచివికావంటాడే నాన్న? వాటిని ముట్టుకుంటే పంచమహాపాతకాలు చుట్టుకుంటాయట. వాటిని ముట్టుకుంటే రోగంకూడ వస్తుందట." అన్నాడు బుల్లాడు

"దానిబతుకు దాన్ని బతకనివ్వక మనం దాన్ని సరిగా చూడనప్పుడు పిల్లి అనారోగ్యంగా ఉండదూ? వొంటి నిండా చీడపడుతుంది. బొచ్చంతా రాలిపోతుంది. మనంచూడకుండా అదిమనం తినే వాటిని ముట్టుకోవచ్చు. మనపక్కల్లో పడుకోవచ్చు. మనగిన్నెల్లో మూతి పెట్టవచ్చు. అట్లాకూడా మనకు రోగాలొస్తాయి ...అంతేగాని మనం శ్రద్ధగా పెంచేపిల్లి ఎంత ఆరోగ్యంగానైనా ఉంటుంది" దానివల్ల మనకూ, మనవల్ల దానికీ, లాభం వుంటుంది. అన్నాడు బావ.

బావ ఈ మాట అంటుండగానే బుల్లాడు దూరంగా ఒక పిల్లిని చూశాడు. బయట గడ్డిలో ఏదో వెతుకు తున్నది పిల్లి.

"అదిమనపిల్లే, బావా"! అన్నదిచిట్టి.

బావా, చిట్టీ, బుల్లోడుకలసి పిల్లిని చూడటానికి బయటికొచ్చారు. వాళ్ళు దగ్గిరికి రావడంచూచి పిల్లి నాలుగు గజాలు పారిపోయి వాళ్ళకేసి భయంతో చూస్తూ నిలబడింది.

"చూశావా. చిట్టీ, మనపిల్లి ఎట్లా అయిపోయిందో, దానివొంటిమీద

బొచ్చంతా రాలిపోయి, చిక్కిపోయి ఎట్లాఉందో?" అన్నాడు బుల్లోడు.

"ఛీ, పాడుపిల్లి మనకొద్దు!" అన్నది చిట్టి

"మనింటో ఎలికెలో?" అన్నాడు బావ

"ఎలికలయితేమటుకు దీన్నెట్లా పెంచుతాం, బావా?" అన్నదిచిట్టి.

"అట్లాకాదే, చిట్టీ దీనికి నాలుగు రోజులు తిండిపెడితే మళ్ళీ బాగా బలుస్తుంది వొంటినిండా బొచ్చొస్తుంది. ఎలికెల్నికూడా పడుతుంది!" అన్నాడు బావ

"నేను పట్టుకోనా?" అంటూ బుల్లాడు పిల్లిదగ్గిరికెళ్ళాడు. పిల్లి భయపడుతూ ముడుచుకుపోయి, పీలగొంతుతో, "మ్యాం," అన్నది.

"ఎంతజాలిగా అరుస్తోందో" అన్నది చిట్టి.

★

పిల్లి ఇప్పుడు బాగాబలిసింది. చిట్టితోనూ బుల్లాడితోనూ చాలసరదాగా ఆడుకుంటుంది. ఇంటోఎక్కడా ఎలికెఅలికిడిలేదు. అదిఒక్కోసారి నాన్నపక్కమీదికేవెళ్ళి దర్జాగా పడుకుంటుంది. నాన్నదానికేసి అనుమానంగా చూస్తాడుగాని, ఏమీఅనడు.

★

" పరుల కలిమికి పొర్లి యేడ్చే
పాపి కెక్కడ సుఖం కద్దోయ్?
ఒకరి మేల్ తన మేలనెంచే
నేర్పరికి మేల్ కొల్లలోయ్! "

— గురజాడ